
నైన్తుక్లాస్ తెలుగు టీచరు చెప్పే పాఠాన్నిఆపి హెడ్‌మిస్ట్రెస్ గదిలోకివెళ్ళి ఐదు నిమషాల్లో తిరిగి వచ్చింది. వస్తూనే స్వర్ణా హెడ్మిస్ట్రెస్ రమ్మంటున్నారు వెళ్ళు అన్నది. చేతిలో పెన్ను కాప్ కూడా మూయకుండానే ఆఫీసురూంలో కెళ్ళింది భయపడుతునే, ఏదో పనిష్మెంట్ ఇవ్వడానికి తప్పితే ఆఫీసు రూంకి పిలవరు. ఇవాళ తెలుగు టీచర్ నత్తిప్రశ్నకి నత్తిగాజవాబిచ్చినసంగతి ఈవిడకురిపోర్టుచేసిందన్నమాట! గుమ్మంలో నుంచుని ఫోన్ చేత్తో పట్టుకునే వున్న హెడ్‌మిస్ట్రిస్‌ని, మేడమ్ పిలిచారుట? అన్నది హీన స్వరంలో. ఆశ్చర్యం. ఎప్పుడూ సీరియస్‌గా వుండే ఆమె ఇవాళ ప్రసన్నంగా వుంది. స్వర్ణా, స్కూల్ కారు సిద్ధంగా వుంది. తక్షణం ఇంటికి వెళ్ళు. నీ బుక్సు టిఫిన్ బాక్సు కారులో పెట్టించాను అన్నది. స్వర్ణకి మతిపోయింది. చిన్నతప్పుకి ఇంటికి వెళ్ళగొట్టడమా? ఇంట్లో అమ్మ ఊరుకుంటుందా? సారీ టీచర్ ఇంకెప్పుడూ అల్లరిచేయను. హోంవర్కు కూడా పూర్తిగా చేస్తాను. క్షమించండి అన్నది ఏడ్పుగొంతుతో.



మేడమ్ అలా చిర్నవ్వుతోనే - శాంతంగానే-లేదు స్వర్ణా నీవు వెంటనే ఇంటి కెళ్లు తర్వాత సంగతి చూద్దాంలే అన్నది. చేసేది లేకస్వర్ణ ఉసూరుమంటూ కారు ఎక్కింది. అమ్మ టీచరమ్మా! ఇవాళ టీచరు వైపోయావుగాని ఒకప్పుడు స్టూడెంట్‌వేగా? ఏ ఒలిపి పని చేయకుండానే చదివావా? హూ! చిన్న తప్పుకి ఇంటికెళ్ళగొడ్తావ్? అమ్మ తిట్టినా, నాన్నగారు నన్ను అర్థం చేసుకుని నీ సంగతి తేలుస్తారు. చూస్తాగా, ఎలా స్కూలుకి రానియ్యరో! ఓసారి వార్నింగేనా యివ్వకుండా వెళ్ళగొట్టడమే? క్లాస్‌మేట్సుతో చెప్పిరావడానికన్నా వీల్లేకపోయింది. స్కూల్ పార్లమెంట్ నాడు లీడర్ నన్ను వెళ్ళగొట్టిన కారణం నిగ్గదీయకపోదు. అంతదాకా ఎందుకు? అన్నయ్య కాలేజి నుంచి రాగానే నిరసనగా స్ట్రైయిక్ చేయించేయడూ? ఈ స్కూల్ సమ్మె చేస్తే ఊళ్ళో స్కూళ్ళన్నీ పాల్గోటం ఖాయం! అప్పుడు తిక్క కుదిరి ఇదే కారులో నన్ను స్కూలుకి తీసికెళ్ళతారు. విద్యార్థుల తడాఖా చూస్తారు. హఠాత్తుగా కారు ఆగింది. తలెత్తి చూడగా తమ యింటిముందు అమ్మా, ఇంకో ఇద్దరు పక్కింటివాళ్లూ, వంటమనిషీ చిరునవ్వుతో వాకిట్లో నిలబడి తననే చూస్తున్నారు.కారు వెళ్ళిపోయింది. తను లోపలికి రాబోతుంటే - ఆగవే - మమ్మల్నంటుకోకు. కాస్సేపు యీ వరండాలో నిలబడు అంటున్నది అమ్మ. రాములుగాడు నాల్గు పచ్చి తాటాకులు తెచ్చి ఓ మూల పడేశాడు. స్కూల్ డ్రెస్ మార్చి లంగా, ఓణీ వేయించింది. ఏమిటో వెధవ గోల. ఇంటందరు పండగలాగ సరదా పడుతున్నారు! పదిమంది ఆడాళ్ళొచ్చారు. స్వర్ణని ఆకులమీద కూర్చోబెట్టి నానా గోలచేసి, హాస్యాలాడి ఎవరిదార్న వాళ్ళు వెళ్ళారు. ఇప్పటికి తల్లి ఒంటిగా దొరికింది. నే నిక్కడ కూర్చోలేను. ఇంట్లోకొచ్చేస్తాను అని ఏడ్చింది. తల్లి వినదు. కోపంవచ్చి తల్లి చీరకొంగు దొరకపుచ్చుకుని లాగింది. తల్లి నవ్వుతూ విసుక్కుని పోయి స్నానం చేసివచ్చింది. సాయంకాలం అన్నయ్య, నాన్నగారు వచ్చి తన గోడు విని తల్లికి నచ్చచెప్పి బ్రతిమాలి-తనని ఆకుల మీద కూర్చునే బాధ తప్పించారు. ఇంట్లో సందడి చుట్టాలు, పరమచికాకు. చివరకి పేరంటం బోలెడు బహుమతులు వారం రోజుల తర్వాత స్వర్ణకి చెరవదిలింది. హాయిగా ఇల్లంతా తిరిగింది. పైటపీకి ఉండచుట్టి ఒమూల విసిరేసింది. అమ్మ చూసి స్కూలు కెళ్ళేటప్పుడు తప్ప ఇంట్లో మాత్రం లంగా ఓణీ వేసుకు తీరాలని చెప్పింది. ఇంకా ఎన్నో చెప్పింది. హఠాత్తుగా ఇన్ని షరతులు. హద్దులు, మార్పులు ఛఛ ఇక జీవితంలో కష్టాలు మొదలైనయ్యా? ఈ వారంరోజులుపడ్డ చికాకులతో పీడా పోయింది అనుకుంటూ నిట్టూర్పు విడిచింది. కానీ - కానీ ఈ చికాకు ప్రతినెలా తప్పదని తర్వాత తెలుసుకుని వుసూరుమన్నది. వారం రోజుల తర్వాత మళ్ళీ యూనిఫారం వేసుకుని బాక్సు తీసుకుని బస్‌కోసం పరుగెత్త బోతుంటే తల్లి ఆపి ఇంకా చిన్నపిల్లలా గెంతులేయకు అని మంద

లించింది. ఏమిటి ?? తాను ఒక్క వారం లోనే చిన్నపిల్లకాకుండా పోయింగాదా ? చట్ తాను ఏమైనాసరే పెద్దమనిషినికాదు పరుగులు మానదు. అల్లరి మానదు. చెప్పినమాట వినదు. ఈ పెద్దాళ్ళంతా ఏం చేస్తారో చూస్తా అని పంతంపట్టింది స్కూల్లోకి రాగానే టీచర్లు-తోటిపిల్లలూ ముసిముసిగా, కొంటెగా నవ్వారు. అబ్బాయిలైతే తానేదో మారిపోయినట్లు తలనుంచీ పాదాలవరకు పరీక్షగా చూసి ముఖం తిప్పుకున్నారు. బఠానీల శీను గాడు పిలిచినా పలక్కుండా తప్పుకు పోయాడు. అయ్యో ఖర్మమా ! వీళ్ళందరికీ ఏమైంది ? ఎవరెలాగైనా చావనీ తానుమాత్రం ఇదివరకులాగే తిరుగుతుంది తనకేం భయమా ? కొత్తగా రెక్కలొచ్చాయా ? ఎవరు ఏలా వున్నా అన్నయ్య, నాన్నగారున్నారు తనని అర్థం చేసుకోడానికి, ఔను ఈ మధ్య అన్నయ్యేదో కొంచం మారినట్లున్నాడే ! తనతో కయ్యాలు పెట్టలేదు, చెవిమెలి పెట్టలేదు. తాన బొక్సులో చిల్లర డబ్బులు, పెన్ను దాచేసుకోడం లేదు. వీడికూడ తిక్క పుట్టిందా ? హుం ? తాను ఏకాకి, మారదలచుకోలేదు. మారదు అంతే ! ఆ ! గట్టి నిర్ణయం తీసుకున్నది. కాని కాని కాలం గడిచే కొలది తనకి తెలియకుండానే తన మనసులో, శరీరంలో మార్పు ! ఓర్పు ! తనంతకు తానే పెద్ద మనిషిగా మారిపోతోందే. తన పనులు తానే చేసుకుంటోంది. ఇంటి పనుల్లో అమ్మకి సాయం చేస్తోంది. పాపం నాన్న గారికి బెడ్ కాఫీ అంటే ఇష్టం కాని అమ్మ పొద్దున్నే లేవలేదు. ఆమె ఆరోగ్యం అంత మంచిది కాదు. పోనీ తాను తెల్లవారుజామున లేచి చదువుతున్నది కదా. ఆ చేత్తో నాన్నగారికి బెడ్ కాఫీ చేసి ఓ రోజు నాన్నగారికి తీసుకెళ్ళింది. ఆయన ఆశ్చర్యపోయి - నీ కెందుమ్మా శ్రమా అన్నారు అంటూనే కాఫీ త్రాగుతుంటే ఆయన ముఖంలో తృప్తి చూడ్డానికి తనకే సంతోషం కలిగింది. అమ్మా నాన్నా పెద్దాళ్ళైపోతున్నారు. తను పెళ్ళీ గిళ్ళీ చేసుకోకుండా వీళ్ళని సుఖపెట్టాలి. సేవ చేయాలని నిర్ణయించు కున్నది. కాని—

కాని ఇంకో రెండేళ్ళకే అర్థంకాని మార్పు కావాలని వస్తూన్నది ఎప్పుడూ ఈ యిల్లు, ఈ మనుషులు, ఈ ఊరు, అబ్బబ్బ. విసుగు, కొత్త వారితో కొత్త స్థలంలో తిరిగితే ? ఒకటి రెండు సార్లు అమ్మ నాన్న గారితో అంటున్నది పిల్లకి చదువుచాల్లే మంచి సంబంధాలు చూడమని. తనని భరించడం అమ్మకి కష్టంగా వుందా ? పెళ్ళిచేసి తరిమేస్తుందా? తానువెళ్ళకేం ! అసలు నాన్న గార్ని వదలి —

తానెక్కడైనాసరే వుండలేదు. నాన్న గారు అంతేగా, తల్లీ కాఫీ అని పక్క మీదనుంచే పిలిచి ఆ వంకలో తను ముఖం పొద్దున్నే చూస్తారు అలాంటాయన అమ్మ చెప్పినంతమాత్రాన తనని పెళ్ళి చేసి తరిమేస్తారా ? అమ్మని చివాట్లు పెడతారనే అనుకున్నది. కాని ఆయన నవ్వి నాకు తెలియదుటే. చూస్తూనేవున్నాను అని అన్నప్పుడు స్వర్ణకి ఏడ్పువచ్చింది. కోపమొచ్చింది. పెళ్ళట పెళ్ళి! ముక్కూ

ముఖం తెలీనివాడ్ని పెళ్ళాడివెళ్ళడానికి కితనేం అందరిలాంటి ఆడపిల్ల అనుకుం టున్నారేమిటి వీళ్ళు? హూ! చూస్తాగా? ఎలా పెళ్ళిచేస్తారో.

ఒక ఏడాది గడిచింది. బి. ఎ. పరీక్ష రాశాక ఓ రోజు అద్దంముందు తీరిగ్గా నిలబడి తన్ను తాను చూసుకుని కంగారు పడ్డది. స్నేహితురాలి పెళ్ళికి వెళ్ళాలని ముస్తాబైన తన రూపం తనకే ముద్దొస్తు న్నది. తొలిసారిగా జరీఅంచుల పట్టు చీరె, నగలు పెట్టుకుని తాను ఎంత ఆకర్ష ణీయంగా వుందో అన్నయ్యముఖం అమ్మ ముఖం చూస్తే తెలుస్తూనేవుంది. పెళ్ళిలో స్నేహితురాళ్ళందరూ తెగ పొగిడారు. యువకులంతా అదోలా చూశారు. తనకి చికాకు కోపంవచ్చే బదులు సంతోషంగా వుందేమిటో! ఆ పెళ్ళికొడుకు బాగు న్నాడు. అందరు పెళ్ళికొడుకులు బాగుం టారా? అల్లరి స్నేహితురాలు పెళ్ళి కూతురు స్థానంలో ఎంత బుద్ధిగా కూర్చుందో! నటిస్తోందా? తను అలా కూర్చోగలదా? తన పెళ్ళికొడుకు అంత బాగుంటాడా? ఏదో ఆలోచిస్తు నిలబడ్డ స్వర్ణ ఎవరో పిలవడంతో ఉలికిపడ్డది. ఛఛ తానసలు పెళ్ళి చేసుకోదు. అసయ్యంగా సిగ్గుపడదు —— కాని——

ఓ నెలకే నాన్నగారు పెళ్ళిచూపులకి ఏర్పాటుచేశారు. అమ్మ సంబరపడింది. తనకి యిష్టంగా లేదు. కాని వద్దనిచెప్పి అడ్డుపెట్టనూ లేకపోయింది. తన నిర్ణ యాలన్నీ ఇలా సడలిపోతున్న వేమిటి? ఈ ఆలోచనతో పెంకితనం వచ్చింది. నేను చెప్పినా, అమ్మ వలలోపడి నాన్న గారు సంబంధం తెచ్చారు. ఎలా చేస్తారో చూడాలి. తనేం చిన్నపిల్లా. చూడ్డానికి వస్తాట్ట చూడ్డం ఏమిటే చూసేది? తన సలు ముఖమెత్తితేగదా అతను చూడ్డం? హూ. కాని ఆ సాయంకాలం చూపుల తతంగం జరిగింది. అందరూ వచ్చు కున్నారు. తను కోపంతో తలెత్తలేదు గానీ హఠాత్తుగా అతడు ఇలా చూడు అన్నాడు, ఇలా చూడు! ఏక వచనప్రయోగం! ఎంత ధైర్యం, పెళ్ళి చూపుల్లోనే ఇంత లోకువగా పల్కరిం చినవాడు పెళ్ళాడాక ఒసేవ్ గిసేవ్ అనకమానడు. బుద్దిచెప్పాలి. రౌడి – పచ్చిరౌడి – మంచి మర్యాదా లేకుండా ఏమిటా పల్కరింపు? చివ్వున తలె త్తింది. అరే! అతడు ఆరడుగుల వాడు అందగాడు. సీరైన బట్టలవాడు, నిండు యౌవనుడు. చిరునవ్వుతో చిలిపిగా తననే చూస్తున్నాడు. ఎంత చక్కనివాడు. స్వర్ణ క్షణంసేపు అతన్ని చూసింది సిగ్గు – తనకి సిగ్గు – అతీతురాల్నను కున్న తనకి ఆకర్షణ అతడ్ని చూసి సంతోషం! వెంటనేలేచి కంగారుగా లోపలికి పరిగెత్తింది. వద్దు. నాకిష్టం లేదు. పెళ్ళివద్దని అరుద్దామనుకుంది. కాని అన్ని నిర్ణయాలలాగే ఈ నిర్ణయం సడలిపోయింది. పెంకెతనం తేలిగ్గా ఒప్పుకోనీయదు. పేపరు చదువుతూ నాన్నగారు తీరిగ్గా కూచున్నవేళ దగ్గర చేరి – అమ్మ వినేట్టుగా – నాన్నా, వద్దం టుంటే పెళ్ళి చేస్తున్నావు. అతడు పేకాట, సిగరెట్, తాగుడు, అమ్మో యిలూ లాంటి పిచ్చివేషాలు వేశాడో తక్షణం నేను రైలెక్కివచ్చేది ఖాయమే. ఆ! అన్నది. తండ్రి నవ్వాడు. అలాగే

నమ్మా – నేనూ ఊరకోకుగా అల్లుడ లాంటి వేషాలు వేస్తే అన్నాడు లాలింపుగా – అమ్మ అబ్బో! అన్నీ చేస్తారు. మీ రొకటి సరిగా వుంటే ఇంకా చెప్పరు కబుర్లు. ఇరవై ఏళ్ళనుంచీ చూస్తూనే వున్నాగా మీ వరస. దాదావు ఏభై ఏళ్ళొచ్చినా మీకే కులుకు తగ్గలేదు కాని– ఇక అల్లుణ్ణి అదుపులో పెడుదురు గాని – అది చూస్తాగా – అని రాగం తీసింది.

స్వర్ణక పెళ్ళైంది. కాపరాని కెళ్ళే టప్పుడు అందర లాగే బావురు మని ఏడ్చింది. తన్నెత్తుకు పోతున్న మొగుడు రాక్షసుడిమీద కోపం వచ్చింది. అది చూసి పోసీ ఉండిపోతావా, నే వెళతాలే. కొన్నాళ్లాగి వద్దూగాని. లేకపోతే మీ కుటుంబం నంతాపిల్చుకొచ్చేయ్–అన్నాడు వెక్కిరింపుగా. రోషంతో వెనక్కి చూడ కుండా అతనివెంట కారెక్కింది స్వర్ణ. మామ నేర్పిన కిటుకు బాగానే పనిచేసింది.

కొత్త కాపురం. భార్య చిన్న పిల్లై నట్లు, తాను రక్షకుడైనట్లు ఓర్పుగా, నేర్పుగా, ప్రేమగా చూస్తున్న భర్తమీద అనురాగమున్నా – లేనట్లే నటించాలను కునేది – కాని అత నొచ్చేవరకు వీధి గుమ్మం దగ్గర ఎదురు చూసి సందు మొదల్లో అతను కనుపించగానే తుర్రున వంటింటివేపు పరిగెత్తేది. దగ్గరగా వచ్చే దాకా చూడనట్లు నటించేది. అతడు కని పెట్టేశాడు. ఓ రోజు ఇలాగే సందు మొదల్లో నుండే గుమ్మంలో భార్యని చూశాడు.

ఆమెలోపలి కెళ్ళడమూ చూశాడు, ఇంట్లోకి తను రాకుండా పక్కసందు లోకి తప్పుకుని పెరటి వాకిట్లోంచి చప్పుడు చేయకుండా దూరి ఏం జరుగు తుందో చూడసాగాడు వీధి గుమ్మం లోంచి ఎవరొచ్చినా వంటింటి కిటికీలోకి తప్పక కనపడతారు. స్వర్ణకి భర్త ఐదు నిమిషాలైనా లోపలికి రాకపోవడం ఆశ్చర్యంవేసింది. మళ్ళి గుమ్మంలోకెళ్ళి తొంగిచూసింది. ఉహూ!అతనిజాడలేదు. నీలంచొక్కా– గళ్ళ పాంటూ సందు మొదట్లో భర్తని తాను ఖచ్చితంగా చూసింది కదా. ఏమై పోయినట్లు? కాసేపు చూశాక కంగారు పుట్టి అక్కడే ఆడుకుంటున్న శీను గాణ్ణి కేకేసి మామయ్య ఇటు వచ్చారు కదా ఏరిరా అంది. వాడు గోళీలాడుతూ అసలు గమనించనే లేదు. ఐనా మెప్పుకోసం అటూ ఇటు చూసి – మరే మామయ్యే– ఆఫీసు అమ్మాయితో మాట్లాడుతూ అటేవెళ్ళి పోయాడుగా – అని మళ్ళీ ఆటలో పడ్డాడు. ఆమె అనుమానంలో పడ్డది. అయ్యో రామా! మొగుడెంత మోసగాడు! ఆ టైపిస్టు పిల్లతో షికా రెళ్ళా రన్నమాట! ఇంట్లో అయ నున్నప్పుడు తన స్నేహితురాళ్ళెవ రొచ్చినా తలొంచుకు పోయే బుద్ధావ తార! వీధిలో స్వైర్య విహారాలు చేస్తారన్న మాట! హవ్వ. ఐతే ఇద్దరూ కలసి సందుమొదట్లో విడిపోయేవారు కాబోలు. ఇవాళే మొశృతి మించి దానితో పాటు వాళ్ళింటికెళ్ళి పోవడమే? దాని తల్లి గుడికి వెళ్ళిందో, బజారుకెళ్ళిందో ఇక ఇద్దరూ ఇంటిలో చేరి– కోపంతో ఆమె ముఖం ఎర్ర బడింది. తాను వీళ్ళ అంతుతేల్చేయాలి – పైదమ్మా చెప్పులు తేవే. అర్జంటుగా బైటకెళ్ళాలి

అని అరచింది. అదిహడలిపోయి. అదేటమ్మగారూ నలిగిన బట్టలు, చెదిరిన బొట్టు సరి చేసుకోకుండా ఎళ్తారేంటి బైటకి- ఎప్పుడనేదే అన్నది. అప్పుడు గుర్తొచ్చింది స్వర్ణకి. నిజమే ఇలా వెళ్తే వీధిలో అందరూ పిచ్చెక్కిందంటారు. అద్దందగ్గరకెళ్ళి దువ్వెనకోసం చూస్తూంటే అద్దంలో-అమ్మో! మంచమీద ముసుగు మనిషెవరూ? భయంతో నాలిక తడారిపోయింది. కళ్ళుమూసుకుని ఒక దూకున అంట్లుతోముతున్న పైడమ్మ ముందు పడింది. తడబడుతు కంగారుగా గదిలో దొంగ సంగతి చెప్పింది. అది తాపీగా కొంగడ్డం పెట్టుకుని నవ్వుతోంది. చేతిలో కాఫీ కప్పు కడుగుతూనే - పదండమ్మగారూ సూద్దాం అని వెంటవచ్చింది. దుప్పటి పక్కని పడేసి లేచి కూర్చుని నవ్వుతున్న భర్తని చూసి నాటకమాడిన పైడమ్మని ఒక్కటిచ్చుకుందామని చూస్తే అది లేదక్కడ. అతడు భార్యని వాటేసుకుని చిలిపిగా నవ్వాడు. రోషంతో ఆమె ఏడ్చి,నవ్వి, అలిగి చివరికి స్థిమితపడింది.

ఏదో మార్పుకావాలి. ఇంకెవరోతోడు కావాలి. మరేదో కాలక్షేపం కావాలి. అస్తమానం పుట్టింటి కెళ్తానంటే అతడేమి అనకపోయినా ఇష్టంతో మాత్రం పంపడు అతడు పంపినా నాల్గురోజులు పూర్తిగా అక్కడవుంటే భర్త గుర్తొస్తాడు. చెప్పడానిక్కి సిగ్గు. అమ్మ వెళ్ళనివ్వదు.అందుకని పుట్టింటికెళ్ళడం కూడా తగ్గించింది మధ్య. ఎంత ఆలోచించినా తేలడంలేదు. ఏం కావాలి? ఏం కావాలి? జ్వరమైనవస్తే బాగుండును,రాదేం?చక్కగా కట్టరు మందు అస్పటలు- అదీ సరదాగానే వుంటుంది.

ఈ అజ్ఞాతమైనకోర్కె ఓరోజుతీరింది. లేస్తూనే ఆ రోజు కళ్ళు తిరిగాయి. బాత్ రూంలో కెళ్ళగానే భళ్ళున వాంతి! భర్త ఏమైందమ్మా? అంటూ కంగారుపడ్డాడు. తాగడానికి నీళ్ళిచ్చి నడిపించి పక్కమీద చేర్చి ఫానువేశాడు. డాక్టరు దగ్గరికి పరిగెడదా మనుకున్నాడు గాని, స్వర్ణదగ్గరెవరూలేరు. పైడమ్మ ఇంకారాలేదు ఏం చేయడం? వెల్తురన్నా పూర్తిగా వస్తే పక్కింటివాళ్ళని పిలవొచ్చు స్వర్ణ కళ్ళుతెరవదు, మాట్లాడదు చెమట పట్టి కదలకుండా పడివుంది ఇంతలో పైడమ్మరానే వచ్చింది. అయ్యగారి గోడువిని అమ్మగారి స్థితిచూసి క్షణం సేపు నిర్ఘాంతపోయింది. ఆ తర్వాత పదేపదే నవ్వింది. డాక్టరెందుకు బావూ. నానున్నాను కానీ ఏటి భయంనేదు. కాఫీ తాగితేసరి పోద్దయ్యా అన్నది తేలిగ్గా అతడు తెల్లబోయాడు, స్వర్ణ కోపంగా చూసింది. ఇంకా తెలుసుకోలేని అకుర్రదంపతుల్ని చూసి పైడమ్మకి లోకువగా వుంది. అయ్యగారూ! పుట్టింటోరికి కబురెట్టండి ఎండి వుయ్యాల దెమ్మని అమ్మగార్కి పుల్ల మామిడికాయ నేనొట్టుకొస్తాగాని మీరెళ్ళి పస్తూసుకొండి మరేటికంగారునేదుగాని అని కొప్పుదులిపి ముడేసుకుని తిప్పుకుంటూ పెరడు ఊడ్వబోయింది. ఒకరినొకరు ఆశ్చర్యంగా చూసుకొని చిన్నగానవ్వుకుని ఆవేశంగా ఒకరిలో ఒకరు ఒదిగిపోయారు. తమకో పాపడు. తమకో బుల్లి బుజ్జాయి వాడికి తాము అమ్మానాన్న! వాడికి తాము రక్షకులు వాడు తమ సృష్టి, తమ భవిష్యత్తు,తమకువాడు సర్వస్వమూ వాడే తమకు సర్వమూను! ఆదేపాదే అమ్మాయికో పాపాయి.